సాక్షి
కాకినాడ

ఆదివారం | 1 | జూన్ | 2025



అలా స్పాగిపోతున్నారు..!

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నయా సంస్కృతి మొదలైంది. ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు వంటి కాస్మోపాలిటిన్ నగరాల్లో ఉండే స్పా సెంటర్ల కల్చర్ ఇక్కడకు విస్తరించింది.


8లో



యోరక్కపోయారుగా..

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యోగాంధ్ర హంగామా ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రజలను భాగస్వాముల్ని చేసేందుకు వారు ఆపసోపాలు పడుతున్నారు.

కడలిలోకి 10,678 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 10,678 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

తొలి తిరుపతిలో భక్తుల రద్దీ



ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవలు, కేశఖండన టికెట్లు, అన్నదాన విరాళాలుగా ఆలయానికి రూ.3,34,407 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. సుమారు 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

36 యూనిట్లకు రూ.1.28 కోట్ల రాయితీలు

కాకినాడ సిటీ: సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహ రాయితీల కింద ఉత్పాదన, సేవా రంగాల్లోని 36 యూనిట్లకు సుమారు రూ.1.28 కోట్ల మేర రాయితీలు కల్పించనున్నామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని జూమ్ ద్వారా శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గడచిన మూడు నెలల్లో వివిధ పరిశ్రమల స్థాపనకు 386 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 333 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. మిగిలిన 53 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ద్వారా జిల్లాలో అర్హత కలిగిన క్లస్టర్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానంగా సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి పథకం (ఎంఎస్ఈసీడీపీ) కింద జిల్లాలో ప్రతిపాదించిన మ్యాంగో జెల్లీ క్లస్టర్ ప్రతిపాదనలను జూన్ నెలాఖరుకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, ఏడీ ఎస్.విజయ్ కుమార్, రవాణా శాఖ అధికారి జీవీ శివరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, ఎల్‌డీఎం సీహెచ్‌వీ ప్రసాద్, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు 3 నుంచి ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం జూన్ 3 నుంచి 10వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేటాయించిన షెడ్యూలు ప్రకారం హాజరు కావాలని సూచించారు. 3వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మెరిట్ నంబర్లు 1 నుంచి 80 వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 81 నుంచి 159 వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 160 – 242 వరకూ, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 243 – 325 మెరిట్ లిస్ట్ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. పైన పేర్కొన్న షెడ్యూల్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి జనరల్ కేటగిరీలో జూన్ 9, 10 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. తొమ్మిదో తేదీ ఉదయం 8 గంటలకు మెరిట్ లిస్ట్ 1 – 159, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 160 – 325 వరకూ, 10వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 326 – 484 వరకూ, మధ్యాహ్నం 485 నుంచి 634 వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయని వేణుగోపాలవర్మ వివరించారు.

కూటమి పాలనలో విలేకర్లపై పెరిగిన దాడులు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో విలేకర్లపై దాడులు పెరిగిపోయాయని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అయినవిల్లి మండల సాక్షి విలేకరి బావిశెట్టి నాగేశ్వరరావుపై అయినవిల్లిలో శుక్రవారం రాత్రి ఇద్దరు యువకులు ముసుగులు ధరించి హత్యాయత్నానికి పాల్పడటం దారుణమని అన్నారు. అమలాపురంలో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వరావును ఆయన శనివారం పరామర్శించారు. దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాక్షి విలేకరిపై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాగేశ్వరరావును వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నవరం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి తదితరులు పరామర్శించారు.

సేవా సారథులకు వెన్నుపోటు



- వలంటీర్లపై కూటమి ప్రభుత్వం కుట్ర
- వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ
- గద్దెనెక్కాక మొత్తం వ్యవస్థకే మంగళం

సాక్షి ప్రతినిధి కాకినాడ: సంక్షేమ పథకం నుంచి ధ్రువీకరణ పత్రం వరకూ.. ప్రభుత్వ పరంగా ఎటువంటి సేవ కావాలన్నా తలలో నాలుకలో మసలే సేవా సారథులు– వలంటీర్లు ఉండేవారు. ప్రభుత్వం ఎటువంటి కార్యక్రమం చేపట్టినా.. దానిపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులను వెతికి పట్టుకుని మరీ లబ్ధిని చేకూర్చేవారు. కరోనా, గోదావరి వరదల వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రాణాలకు తెగించి మరీ విశిష్ట సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు ఎంతో చేరువ చేసి, దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ వ్యవస్థకు కూటమి పెద్దలు వెన్నుపోటు పొడిచారు. తొలి నుంచీ విషం చిమ్ముతూనే.. ఎవ్వరినీ తొలగించబోమని, పైగా వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల్లో నమ్మకంగా చెబుతూనే వంచించారు. ఫలితంగా జిల్లావ్యాప్తంగా 620 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని దాదాపు 12 వేల మంది వలంటీర్లు ఏడాది కాలంగా వీధిన పడ్డారు.



కోవిడ్ సమయంలో బాధితులకు మందులు, నిత్యావసర సరకులు అందజేస్తున్న వలంటీర్

గతంలో అవార్డులు

వలంటీర్లు అందించిన సేవలను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవార్డులు వారికి అందించేది. అందించిన సేవలను బట్టి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలుగా వలంటీర్లను విభజించి పురస్కారాలు అందించేది. గత ఏడాది ఫిబ్రవరిలో అవార్డుల మొత్తాన్ని పెంచారు. సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేల చొప్పున అందించి గౌరవించారు.

నమ్మించి.. వంచించి..

ఇంతటి విశిష్ట సేవలందించిన వలంటీర్లకు కూటమి ప్రభుత్వం శాశ్వత సెలవు ప్రకటించింది. అసలు ఈ వ్యవస్థకు రూపమే లేదని, జీఓ లేదని ప్రకటించి, వలంటీర్లకు వెన్నుపోటు పొడిచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వేతనం రూ.10 వేలకు పెంచాలని, పెండింగ్ వేతనం కూడా ఇవ్వాలంటూ వలంటీర్లు చేస్తున్న డిమాండ్ కూటమి పెద్దల చెవికెక్కడం లేదు. వారి ఆందోళనలను ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయలేదు. ప్రభుత్వ నిర్దయతో నేడు వారిలో చాలా మంది దినసరి కూలీలుగా మారిపోవడం ఓ విషాదం.

వారి సేవలు అమోఘం



ప్రజలకు అండగా నిలిచిన వారిలో వలంటీర్లు క్రియాశీలక పాత్ర పోషించారు. కోవిడ్–19 సమయంలో వారి సేవలకు వెల కట్టలేం. కొన్ని కోట్లు కుమ్మరించినా వారి సేవలను మరోసారి చూడలేం. కుటుంబ సభ్యులకు మించి వలంటీర్లను ఎక్కువగా కోవిడ్ రోగులను చూసుకున్నారు. ప్రతి పథకాన్నీ తెలియజేసి అర్హులైన వారికి అందించేవారు.

– కొత్తూరి రాజేశ్వరి, వాకలపూడి

వలంటీరుతోనే విద్యా దీవెన



వలంటీరు ఇంటి ముంగిటకే వచ్చి దరఖాస్తు పూర్తి చేసి తీసుకుని అవగాహన కల్పించడంతోనే మాకు విద్యాదీవెన వచ్చింది. అందువల్లనే మా పిల్లలు ఈ రోజు బాగా చదువుకోగలుగుతున్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన పథకం తీసుకురావడమే కాకుండా ఆ పథకాన్ని వలంటీరు ద్వారా ఇంటికి పంపించి మరీ మంజూరు చేయించారు. మొదట్లో వలంటీర్లను చూసి వీళ్లేం చేస్తారనుకునే వాళ్లం. కానీ, వారు చేసిన సేవలు మాటలు కాదు. వారి మేలును జీవితంలో ఎప్పటికీ మరచిపోలేం. ఇల్లు లేని వారికి జగనన్న కాలనీలో ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయించడంలో వలంటీర్లు చాలానే చేశారు.

– అలమూరు దుర్గ, నవరత్నాల లబ్ధిదారు, పవర, సామర్లకోట మండలం

ప్రాణాలు లెక్క చేయకుండా..



మా ప్రాణాలు కూడా లెక్క చేయకుండా కరోనా బాధితులకు సేవలందించాం. మా కుటుంబాల్లోని వారి కంటే మాకు కేటాయించిన కుటుంబాల్లోని వారి ప్రాణాలే ముఖ్యమనుకుని పని చేశాం. కోవిడ్ రోగుల వద్దకు వెళ్లేందుకు వారి కుటుంబ సభ్యులే భయపడిపోయే వారు. అటువంటి బాధితులు హోం ఐసోలేషన్, క్వారంటైన్‌లో ఉన్నా లెక్క చేయకుండా వలంటీర్లుగా మేము ఎంతో చేశాం. అటువంటి మమ్మల్ని అర్ధాంతరంగా రోడ్డున పడేశారు. వేతనం రూ.10 వేలు చేస్తామని చెబితే నిజమే అనుకున్నాం. తీరా మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం అన్యాయం.

– కడియాల కిరణ్, వలంటీర్, వాకలపూడి

మన్ననలందుకున్నారిలా..

- ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే సంకల్పంతో సచివాలయాలకు అనుబంధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకు వచ్చింది. ప్రతి 50 కుటుంబాలకు ఒకరు చొప్పున వలంటీర్లను నియమించింది. వీరికి రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చేది.
- ప్రతి నెలా ఒకటో తేదీన తూర్పు తెల్లవారకముందే అవ్వాతాతల ఇళ్ల తలుపులు వలంటీర్లు తట్టేవారు. వారికి అందించాల్సిన పింఛన్లు నిస్వార్థంగా అందించేవారు. కొన్నిసార్లు లబ్ధిదారులు ఏదైనా అనుకోని కారణంతో సుదూర ప్రాంతాల్లో, ఆసుపత్రుల్లో ఉంటే.. సొంత ఖర్చులతో ఆయా ప్రాంతాలకు వెళ్లి మరీ పింఛన్లు అందించిన సందర్భాలు కోకొల్లలు.
- పిల్లల చదువులకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి ముంగిట్లోనే అందించేవారు.
- అనేక సంక్షేమ పథకాలకు తమ పరిధిలోని అర్హులను ప్రత్యేకంగా గుర్తించి మరీ, ఎటువంటి లాభాపేక్షా లేకుండా లబ్ధి చేకూర్చేవారు.
- కరోనా కష్ట కాలంలో సొంత కుటుంబ సభ్యులు కూడా తమ వారి వద్దకు వెళ్లి మంచి నీరు, ఆహారం, మందులు అందించలేని విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు తమ కుటుంబాలను, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు విశేష సేవలందించారు.
- గోదావరి వరదలు, ఇతర విపత్తుల్లో సైతం వలంటీర్లు వెల కట్టలేని సేవలందించారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు



వేతనంతో సంబంధం లేకుండా ఐదేళ్ల పాటు ప్రజలకు నిష్పక్షపాతంగా సాయం అందించడం చాలా సంతృప్తినిచ్చింది. స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయాలన్న తపనతో కోవిడ్ సమయంలో ఎంతో చేశాం. ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లల్లో ఉండిపోతే మేమే వారికి నిత్యావసర వస్తువులు, మందులు అందించాం. రోగులకు ఆస్పత్రికి వెళ్లి మరీ పింఛన్లు అందించే వాళ్లం. వరదల సమయంలో ప్రతి ఇంటికీ పీకల్లోతు నీటిలో వెళ్లి ప్రజలకు నిత్యావసర సరకులు, మంచినీరు అందించాం. దురుద్దేశంతోనే వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. అప్పుడు మేం చేసిన సేవలను ప్రజలు ఇప్పుడు గుర్తిస్తున్నారు. చాలా సంతోషం.

– వలీ బాబా, వలంటీర్, పిఠాపురం

అక్రమ కేసులకు బెదరొద్దు

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- న్యాయ పోరాటం చేద్దాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: చంద్రబాబు నాయుడి ఏడాది పాలన అక్రమ కేసుల నమోదుకే సరిపోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. ఎస్.అన్నవరంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 12 వేల మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. దీనికి బెదరాల్సిన పని లేదని, కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని, కేసులు ఎత్తివేయకపోతే న్యాయ పోరాటం చేద్దామని అన్నారు. పార్టీ నాయకత్వం న్యాయ సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసగించారని అన్నారు. జనం తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, అప్పుడు అక్రమ కేసులు పెట్టిన నాయకులు, హామీలిచ్చిన నాయకులు పారిపోయే రోజులు వస్తాయని చెప్పారు. మూడు రోజుల మహా డ్రామా నడిచిందని, జగన్ మోహన్‌రెడ్డిని తిట్టడమే అజెండాగా కడపలో టీడీపీ మహానాడు నిర్వహించారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రం తలసరి ఆదాయంలో మొదటి ఐదు స్థానాల్లో నిలవగా ఇప్పుడు అధ్వానంగా ఉందని రాజా చెప్పారు. వైద్య విద్యను ఖరీదైనదిగా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. జగన్ నాయకత్వంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కో వైద్య కళాశాలను రూ.500 కోట్లతో నిర్మిస్తే వాటిని తన అనుయాయులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు రూ.5 వేలకే అద్దెకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తోందని అన్నారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాల ఉంటే ప్రజలకు ఉచిత వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. మద్యం అక్రమ కేసులు బనాయించేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే, డిస్టిలరీలన్నీ టీడీపీ నాయకులకు చెందినవే ఉన్నాయని అన్నారు. రోజులో ఎక్కువ సమయాన్ని వైఎస్సార్ సీపీ పటిష్టత కోసమే అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేటాయిస్తున్నారన్నారు. నమ్మకంగా పని చేస్తున్న కార్యకర్తలకు పార్టీ పదవులు అప్పగిస్తున్నామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు, పార్టీని నమ్ముకున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని రాజా స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు చోడ్రాజు రాంబాబురాజు, రాయి మేరీ అవినాష్, నాగం దొరబాబు, లంక కృపానందం, దొంక వెంకట బెనర్జీ, కీర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి.. కిక్కిరిసి..

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- 5,200 వ్రతాలు
- దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం



అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం కిక్కిరిసిపోయింది. రత్నగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు, వారి బంధువులతో పాటు ఇతర భక్తులు కూడా సత్యదేవుని దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట పట్టింది. తీవ్రమైన రద్దీ కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాలయ దర్శనం రద్దు చేశారు. సత్యదేవుని 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు 5,200 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 6 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం వాతావరణం మేఘావృతమై వర్ష సూచనలు ఉండటంతో సత్యదేవుని ప్రాకార సేవ పల్లకీ మీద ఆలయం లోపలి ప్రాకారంలో నిర్వహించారు. సత్యదేవుని సన్నిధిలో ఆదివారం కూడా రద్దీ కొనసాగనుంది. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాకారంలో టేకు రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఊరేగించనున్నారు. రూ.2,500 చెల్లించిన భక్తులు ఈ రథ సేవలో పాల్గొనవచ్చు. ఆ రుసుం చెల్లించిన వారి కుటుంబ సభ్యులు నలుగురికి స్వామివారి అంతరాలయ దర్శనం, ప్రసాదం, వేదాశీర్వచనం, దంపతులకు కండువా, జాకెట్టు ముక్క అందజేస్తారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదేం?

- సామర్లకోటలో మున్సిపల్ కౌన్సిలర్ల నిరసన
- కమిషనర్ నిలదీత



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

సామర్లకోట: ప్రతి నెలా జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం మే నెలలో నిర్వహించకపోవడంపై సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు 24 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నల్లబ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యం నశించాలంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు కూడా నిర్వహించిన కౌన్సిల్ సమావేశం మే నెలలో నిర్వహించకపోవడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మే 15న మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తన పదవికి రాజీనామా చేశారని, అదే రోజు ఆమెపై 25 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించారని గుర్తు చేశారు. అదే సమయంలో సభ్యులందరూ కలిసి అత్యవసర సమావేశం నిర్వహించాలని కోరినా కమిషనర్ ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదన్నారు. సాధారణ సమావేశం నిర్వహణకు నాలుగు రోజుల ముందు, అత్యవసర సమావేశానికి 24 గంటల ముందుగా అజెండా రావాల్సి ఉండగా శనివారం వరకూ అందలేదని, దీంతో సమావేశం జరిగే అవకాశం లేదని తెలిసి, నిరసన తెలియజేస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీకి వచ్చిన నిధులతో అభివృద్ధి పనుల ఆమోదానికి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని, అలా జరగకపోవడంతో అభివృద్ధి కుంటుబడే అవకాశం ఉందని అన్నారు. సభ్యులు ఆయా వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించడానికి కౌన్సిల్ సమావేశం దోహదపడుతుందన్నారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు కాకపోవడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని జాన్ మోజెస్ డిమాండ్ చేశారు.

కమిషనర్‌కు వినతి

మే నెలలో సాధారణ లేదా అత్యవసర సమావేశం ఏర్పాటు చేయకపోవడానికి కారణమేమిటని 24 మంది కౌన్సిలర్లు కమిషనర్ ఎ.శ్రీవిద్యను నిలదీశారు. ఈ మేరకు వారందరి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకు అందజేశారు. కమిషనర్ బదులిస్తూ చైర్‌పర్సన్ అంశం కోర్టులో ఉన్నందున సమావేశం నిర్వహించలేకపోయామని చెప్పారు. సీడీఎంఏ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని అన్నారు. రాజీనామా అనంతరం మరుసటి రోజునే చైర్‌పర్సన్ రాజీనామాను ఉపసంహరించుకున్నారని, మెజార్టీ సభ్యులు వైస్ చైర్మన్ జాన్ మోజెస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని అదే రోజు కోరారని చెప్పారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని, తాను స్వయంగా నిర్ణయం తీసుకునే అంశం కాదని అన్నారు. సమావేశం జరగకపోవడంతో మే నెల గౌరవ వేతనం ఉండదని సభ్యులు అడిగి ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. 15 రోజుల గడువు ఉన్నా అధికారులు నిర్ణయం తీసుకోకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో వైస్ చైర్మన్–2 గోకిన సునేత్రాదేవి, 22 మంది సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు ప్రాణం తీసిన కలుపు మందు


చెల్లు లీలాకృష్ణ ప్రసాద్ (ఫైల్)

నల్లజర్ల: పంట పొలాల్లో కలుపు నివారణకు వినియోగించే గడ్డి మందు ఓ యువ రైతు ప్రాణం తీసింది. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని చీపురుగూడెంకు చెందిన యువ రైతు చెల్లు లీలాకృష్ణ ప్రసాద్ (30) పదిహేను రోజుల కిందట పొలాల్లో కలుపు నివారణకు ఇంటి వద్ద ఉన్న గడ్డి మందు డబ్బాను పొలానికి తీసుకెళ్లాడు. ఆ డబ్బాను బైక్ ముందు కవర్‌లో పెట్టాడు. మార్గ మధ్యంలో డబ్బా మూత లీకై అతని ప్యాంట్‌పై పడింది. ఏమీకాదులే అని కడిగేసుకుని ఆ మందు స్ప్రే చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఒక్కరోజు వ్యవధిలోనే ఒంటిపై పడిన మందు ద్రావణం వృషణాల నుంచి శరీరంలోని కిడ్నీ, లివర్ తదితర అవయవాలకు సోకింది. అతను విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తండ్రి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏడాది క్రితమే ప్రసాద్‌కు అవపాడుకు చెందిన మౌనికతో వివాహం కాగా, ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. ప్రసాద్ మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

అటవీ భూమిలో చెట్ల నరికివేత

గోపాలపురం: మండలంలోని కోమటికుంట అటవీ భూమిలో ఉన్న చెట్లు నరికివేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రెండు ట్రాక్టర్ల పుల్లలను స్వాధీనం చేసుకున్నామని డీఆర్‌ఓ కె.వేణుగోపాల్ శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అటవీ శాఖకు చెందిన భూమిలో ఉన్న వేప, జీడిమామిడి చెట్లు అక్రమార్కులు నరుకుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. సుమారు 12 టన్నుల పుల్లలను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ తెలిపారు.

వసతి గదులు కేటాయించాలని భక్తుల ఆందోళన

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలోని సత్రాల్లో వసతి గదులు ఖాళీగా ఉన్నా కేటాయించడం లేదని శనివారం రాత్రి పలువురు భక్తులు ఆందోళన చేశారు. రాత్రి 11 నుంచి 11.40 గంటల వరకూ భక్తుల ఆందోళన కొనసాగింది. విషయం తెలిసిన ఈవో సుబ్బారావు వచ్చి కొండపై ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్‌లో తనిఖీ చేశారు. అనంతరం రిజర్వేషన్ ఉన్న గదులను మినహాయించి, మిగిలినవి భక్తులకు కేటాయించడంతో సమస్య సర్దుమణిగింది.

అలా స్పాగిపోతున్నారు..!

- మసాజ్ పేరుతో మగువలతో వల
- రాజమహేంద్రవరంలో స్పా సెంటర్లు
- గుట్టుచప్పుడు కాకుండా హైటెక్ వ్యభిచారం
- దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం


రాజమహేంద్రవరంలో పోలీసులు దాడి చేసిన స్పా సెంటర్



ఓ సెంటర్‌లో ఆధునిక వసతులతో కూడిన గది

కంబాలచెరువు: (రాజమహేంద్రవరం): సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నయా సంస్కృతి మొదలైంది. ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు వంటి కాస్మోపాలిటిన్ నగరాల్లో ఉండే స్పా సెంటర్ల కల్చర్ ఇక్కడకు విస్తరించింది. మసాజ్ పేరుతో హైటెక్ వ్యభిచారం అధికమైంది. ఉపాధి పేరుతో ఆయా స్పా సెంటర్లలో చేరిన యువతులను నిర్వాహకులు పడుపు వృత్తిలోకి దింపుతున్నారు. ఏడాది కాలంలో నగరంలో వ్యభిచారం నిర్వహిస్తున్న సుమారు 14 స్పా సెంటర్లపై పోలీసులు దాడులు చేసి పట్టుకోవడం చూస్తే.. జిల్లాలో చాపకింద నీరులా విష సంస్కృతి పెరిగిందని చెప్పకనే అర్థమవుతోంది.

ఎక్కడే ఎందుకంటే..

రాజమహేంద్రవరంలో ధనిక వర్గాలు ఎక్కువగా ఉండే ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డు, దానవాయిపేట వంటి ప్రాంతాల్లో ఇటీవల స్పా సెంటర్లు పెరుగుతున్నాయి. నిరుద్యోగ యువత ఉపాధి వేటలో భాగంగా బ్యూటీ కోర్సులు, మసాజ్ కోర్సులు వంటివి చేసి స్పా సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారం బాగుంటుండటంతో అసాంఘిక శక్తులు ఈ రంగంలోకి ప్రవేశించి పెట్టుబడి పెడుతూ తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బులు సంపాందించేందుకు పథక రచన చేస్తున్నారు. బ్యూటీపార్లర్లతో కూడిన మసాజ్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే కస్టమర్లను వ్యభిచారం వైపు లాగుతున్నారు. ఆయా సెంటర్లకు వెళ్లే విటులలో ఎక్కువ వ్యాపార వర్గాలు, యువత ఉంటున్నారు. కొద్దినెలల కిందట ఏవీ అప్పారావు రోడ్డులో పట్టుబడిన స్పా సెంటర్ నిర్వాహకురాలు బ్యూటీ పార్లర్లకు వచ్చే మహిళలకు వారి అభిరుచి మేరకు మగ వ్యభిచారులను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు ఓ వాయిస్ రికార్డింగు బయటపడటం చూస్తే పరిస్థితి చేయిదాటిందని అర్థమవుతోంది. ఎక్కడో మెట్రోపాలిటిన్ సిటీల్లో బయటపడే ఇటువంటి ఘటనలు జిల్లాలో విస్తరించడం చూస్తే అసాంఘిక శక్తులు ఏ మేరకు చొచ్చుకు వస్తున్నాయో స్పష్టమవుతోంది.

ఉద్యోగం పేరుతో..

బ్యూటీపార్లర్, సెలూన్, స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచారాలు ప్రారంభించే నిర్వాహకులు ముందుగా బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి మసాజ్ సెంటర్లలో అనుభవం ఉన్న ఒకరిద్దరు యువతులను ఆకర్షణీయమైన ప్యాకేజీతో నియమించుకుంటారు. జన సంచారం తక్కువగా ఉండే ధనిక వర్గాలు నివసించే ప్రాంతాల్లో అట్టహాసంగా స్పా, సెలూన్ సెంటర్లు ప్రారంభించి రిసెప్షన్, హెల్పర్ల పేరుతో అందమైన యువతులను పనిలో పెట్టుకుంటారు. ముందే అనుభవం ఉన్న యువతులు కొత్తగా చేరిన వారితో సన్నిహితంగా ఉంటారు. వారికి ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తూ తమవైపు తిప్పుకుంటారు. వారి అవసరాలకు డబ్బులు ఇస్తూ పూర్తిగా వీరి ఉచ్చులో పడే విధంగా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటారు. కొత్తగా చేరిన యువతులకు పాత యువతులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తూ వారిని కూడా మసాజ్ ప్రక్రియకు ఉపయోగించుకుని కమీషన్ ఇస్తారు. నిర్వాహకులు ఆ యువతులతో చనువుగా ఉంటూ ఫోటోలు దిగడం చేస్తుంటారు. అవి నిర్వాహకుల వద్ద ఉండటంతో ఆ యువతులు పూర్తిగా విధేయతతో ఉంటారు. వారితో గొడవ పెట్టుకునేందుకు సాహసించరు. ఇలా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం సాగిపోతోంది.

హెయిర్ కటింగ్‌తో ప్రారంభమై..

ముందుగా హెయిర్ కటింగ్‌తో కస్టమర్లను ఆకర్షించే నిర్వాహకులు కస్టమర్లు అడగకపోయినా హెడ్ మసాజ్ వంటివి చేస్తారు. వారు చూపిస్తున్న ఆసక్తిని బట్టి తమ వద్ద బాడీ మసాజ్ కూడా ఉందని చెబుతారు. అలా ముగ్గులోకి వచ్చిన కస్టమర్లతో మసాజ్ ప్రక్రియలో భాగంగా పరిచయం పెంచుకుంటారు. చీకటి మాటున జరిగే ఈ మసాజ్ ప్రక్రియలో ఫుల్ మసాజ్, బాడీ టూ బాడీ మసాజ్ వంటి పేర్లతో యువతులతో మగ కస్టమర్లను ఆకర్షిస్తారు. ఇలా ప్రత్యేక గదిలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం కూడా జరిగిపోతుంది. అలవాటు పడిన కస్టమర్లు వారానికి ఒకసారైనా ఇక్కడకు వస్తున్నారని అంటున్నారు. ఇటీవల ఓ మసాజ్ సెంటర్ నిర్వాహకురాలి ఫోన్‌లో బ్యూటీపార్లర్‌కు వచ్చే ఆడవారికి మగ వ్యభిచారులను కూడా సమకూరుస్తున్నట్టు రికార్డింగ్ బయటపడటం విష సంస్కృతికి అద్దంపడుతోంది.

ఏడాదిలో 14 సెంటర్లపై దాడి



ఏడాది కాలంలో జిల్లాలోని రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో మసాజ్ సెంటర్లు, సెలూన్లు, బ్యూటీ పార్లర్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న 14 సెంటర్లపై పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. అక్కడ దొరికే యువతులను సాక్షులుగా పరిగణిస్తూ విటులపై, నిర్వాహకులపై కేసులు నమోదు చేశాం. స్పాలు, బ్యూటీపార్లర్లపై నిరంతరం నిఘా పెడుతున్నాం. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా సమాచారం ఇవ్వాలి.

–డి.నరసింహకిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

ఇసుక తవ్వకాలపై ఎన్‌జీటీకి సమాచారం


సూరెడ్డి శివకుమార్, మాజీ సైనికుడు

సీతానగరం: మండలంలోని సింగవరం ర్యాంపు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలపై చెన్నై, ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్‌జీటీ)కు మెయిల్ ద్వారా సమాచా రం ఇచ్చానని వంగలపూడికి చెందిన మాజీ సైనికుడు, న్యాయ వాది సూరెడ్డి శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను అడ్డుకుని, వాటిని వీడియోలు, ఫొటోలు తీసి జిల్లా కలెక్టర్, ఏడీ మైన్స్, తహసీల్దార్, ఎస్సైలకు సామాజిక మాధ్య మాల ద్వారా తెలియపర్చానని తెలిపారు. దీంతో ఎస్సై స్పందించి లారీలను నిలిపివేశారని అన్నారు. శనివారం ఉదయం మైన్స్ ఏడీ నుంచి లిఖిత పూర్వక మెసేజ్ ఇచ్చారని, అందులో జిల్లా కలెక్టర్‌కు గాని, తనకు గాని సంబంధం లేదని తెలిపారన్నారు. అనకాపల్లి కలెక్టర్, మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు మాత్రమే సంబంధం ఉందని తెలియపర్చారని వివరించారు. జిల్లాలో తవ్వకాలపై వారికి సంబంధం లేదని అనడం హాస్యాస్పదంగా ఉందని, ఎన్జీటీకి తెలిపర్చిన తరువాత తనకు సమాచారం అందించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సింగవరం లంక భూముల్లో తవ్వకాలు జరపాల్సి ఉండగా, వంగలపూడి లంక భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి, సింగవరం ర్యాంపు నుంచి కాకుండా వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుక లారీలపై తరలిస్తున్నారని అన్నారు. సోమవారం గ్రామస్తులంతా లారీలను అడ్డుకుంటారని, అనకాపల్లి కలెక్టర్, ఏడీ మైన్స్ వారు వచ్చి పూర్తి వివరాలు తెలియజేసే వరకూ ఆ లారీలను అడ్డుకుంటామని శివకుమార్ హెచ్చరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ.పాత (ముక్కుడు) కాయ (వెయ్యి)	14,500 - 15,000
కొత్త (పచ్చి) కాయ (వెయ్యి)	14,500- 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260



యోరక్కపోయారుగా..

- ఉద్యోగులకు యోగాంధ్ర పాట్లు
- జన సమీకరణకు ఆపసోపాలు
- వేలల్లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిళ్లు
- సచివాలయ సిబ్బందికి టార్గెట్లు


యోగా చేయిస్తున్న శిక్షకుడు

కాకినాడ సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది.. జూన్ 21వ తేదీకి అందరికీ యోగాపై సంపూర్ణ అవగాహన ఉండాలంటూ నెల రోజుల కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.. ఈ సందర్భంగా ప్రతి రోజూ గ్రామ, పట్టణ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. ప్రజలను భాగస్వామ్యం చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తోంది. దీంతో జిల్లాలో కార్పొరేషన్, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రహదారులపై యోగా చేయిస్తుంది. ర్యాలీలు చేపడుతుంది. మొత్తంగా జిల్లా అధికార యంత్రాంగం దాదాపు కొద్ది రోజులుగా ఇదే పనిలో ఉంటోంది. జూన్ 21వ తేదీ వరకూ ఇదే హడావుడి. మరి ఇవన్నీ చేయాలంటే మనుషులు ఉండాలి. అందుకోసం అందుబాటులో ఉన్న ఏ ఒక్కరినీ వదలడం లేదు. అంగన్‌వాడీలు, డ్వాక్రా మహిళలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్నారు. వీటిని పక్కాగా అమలు చేసేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలను నియమించారు. యోగాంధ్ర మినహా కొద్దిరోజులుగా మిగతా విషయాలను పక్కన పెట్టేశారు.

లెక్కల కోసం తిప్పలు

యోగా మాసంలో భాగంగా వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని పైనుంచి ఆదేశాలు వచ్చాయి. అంతేకాదు పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెబుతున్నారు. దీంతో లెక్కలు చూపించేందుకు జిల్లా అధికారులు అపసోపాలు పడుతున్నారు. పెద్దఎత్తున రిజిస్ట్రేషన్ చేయాలని సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించారు. దీనికోసం యోగా మంత్ యాప్‌ను సిద్ధం చేశారు. స్వచ్ఛందంగా ప్రజలెవరూ నమోదుకు ముందుకు రాకపోవడంతో సచివాలయ సిబ్బందే తమకు తెలిసిన వారి నంబర్లు సేకరించి, వారికి ఓటీపీలు ఇవ్వండంటూ బతిమలాడుతూ, రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇలా ఎందుకు ఓటీపీలు అడుగుతున్నారో కూడా చాలా మందికి తెలియకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతోనూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో సుమారు 10 లక్షల మందిని యోగాంధ్రలో భాగస్వాములు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రతి రోజూ ఉద్యోగులను ఆయా కార్యాలయాల్లో యోగా చేసినట్లు ఫొటోలు తీసి నెట్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలుండడంతో అధికారులు ఉద్యోగులను, ప్రజలను సమీకరించి యోగా కార్యక్రమాలు చేపట్టేందుకు వారికి తల ప్రాణం తోకకు వస్తుందని వాపోతున్నారు. గతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఏదో కార్యక్రమం చేపట్టేవారని, ఇలా నెల రోజులు నిర్వహించి, పెద్దఎత్తున నిధులు, సమయం వృథా చేయడం ఎన్నడూ లేదని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారులు సైతం మరోదారి లేక ఫొటోల కోసం మమ అనిపించేస్తున్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


ఉయ్యూరువారి మెరకలో చెట్టు పైనే మృతి చెందిన నాని

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరక గ్రామంలోని పైలాన్ సెంటర్లో శనివారం విద్యుత్ షాక్‌కు గురై దింపు కార్మికుడు బూసి నాని (28) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఒక రైతు పొలంలో నాని కొబ్బరి దింపు తీస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. చెట్టుకు సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైనుకు చేరిఉన్న కొబ్బరి ఆకును తొలగించే క్రమంలో ప్రమాదశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో మృతి చెందిన నాని చెట్టుపైనే మోకుతో వేలాడుతూ ఉండిపోయాడు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు


రాజానగరంలో ప్రమాదం జరిగిన ప్రాంతం


సత్యభాస్కరరావు (ఫైల్)

రాజానగరం: జాతీయ రహదారిపై రాజానగరం ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన బిక్కన సత్యభాస్కరరావు (69), అతని భార్య పాపాయమ్మతో కలసి స్కూటీపై పెద్దాపురం మండలం కట్టమూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా, వీరి వెనుక నుంచి వ్యాన్ వచ్చి ఢీకొంది. దీంతో సత్యభాస్కరరావు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్యకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం


రెడ్డి పైడారావు (ఫైల్)

బిక్కవోలు: పందలపాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన రెడ్డి పైడారావు (57) పనిపై తొస్సిపూడి వెళ్లి తిరిగి బైకుపై ఇంటి వస్తుండగా... తొస్సిపూడి సెంటర్‌లో గుడిమెట్ల శ్రీనివాస్‌రెడ్డిని వస్తున్నారు. పందలపాక కోదండరామా రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి, ధాన్యం ట్రాక్టర్ వేగంగా వెళ్తూ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న వీరు అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. దీంతో వారిని అనపర్తి సీహెచ్‌సీకి తరలించడంతో రెడ్డి పైడారావు మృతి చెందాడు. గుడిమెట్ల శ్రీనువాస్‌రెడ్డి గాయాలతో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. అందరితో సరదా ఉండే వ్యక్తి మృతితో విషాదచాయలు అల్లుకున్నాయి.

విద్యార్థినులకు స్టేట్ ర్యాంకులు


లిఖిత


బేగం

రాజానగరం: స్థానిక జీఎస్‌ఎల్ ఫిజియోథెరపీ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు స్టేట్ ర్యాంకులు సాధించారు. వై.లిఖిత ఫస్ట్ ర్యాంకు, ఎండీవీజే బేగం 7వ ర్యాంకును పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తెలిపారు. వారిని యాజమాన్యం అభినందించింది.

మాల మహానాడు జేఏసీ నాయకుల అరెస్ట్

పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలింపు


ముమ్మిడివరంలో గృహ నిర్బంధంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు మునికుమారి


కాట్రేనికోనలో గృహ నిర్బంధంలో జేఏసీ నాయకులు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం వచ్చిన సీఎం చంద్రబాబుకు ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరిగిందని తెలపాలని మాల మహానాడు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాల మహానాడు జేఏసీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమలాపురం రూరల్, క్రైమ్ సీఐల ఆధ్వర్యంలో శనివారం ఉదయం బందరుపాలెం సమీపంలో కర్రివానిరేవుకు చెందిన జేఏసీ నాయకుడు కాశి జగపతిరావు, ఎదుర్లంక గ్రామానికి చెందిన దుక్కిపాటి సత్యనారాయణ, ముమ్మిడివరానికి చెందిన దేవరపల్లి ఏడుకొండలు, మెండి కృష్ణబాబు, ఉచ్చుల సాల్మన్‌రాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పామర్రు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జేఏసీ నాయకులతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా నాయకురాలు కాశి బాలమునికుమారిని ముమ్మిడివరం బాలయోగి ఆశ్రమం వద్ద గృహ నిర్బంధం చేశారు.అలాగే కాట్రేనికోనకు చెందిన వడ్డి శ్యాంప్రసాద్, గల్లా రాజేందర్‌లను గృహ నిర్బంధం చేశారు. శనివారం రాత్రి ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌కు జేఏసీ నాయకులను తీసుకు వచ్చి అప్పగించారు.

పర్యాటకుల కోసం ప్రత్యేక రైళ్లు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఉత్తర భారత దేశంలో ప్రముఖ దేవాలయాలను సందర్శించుకునేలా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ హాలో సంయుక్త ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పర్యాటక రైళ్లను నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆయన మీడియా సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 14న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా సికింద్రాబాద్ నుంచి అయోధ్య కాశీ పుణ్యక్షేత్రాలు మీదుగా వారణాసి, ప్రయోగరాజ్, రామ జన్మభూమి, త్రివేణి సంగమం నైమిశా శరణ్యం సందర్శించుకోవచ్చన్నారు. 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ పర్యటన ఎకానమీ, స్టాండర్డ్, కంఫర్ట్ ప్యాకేజీల్లో ఉందన్నారు. ఈ రైలుకు విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని బోర్డింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి జూలై 5న పంచ జ్యోతిర్లింగ దర్శన్ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ప్రారంభమై అదే నెల 13న యాత్ర ముగుస్తుందన్నారు. నాగపూర్, ఉజ్జయిని, నాసిక్, పూణే ఔరంగాబాద్, డాక్టర్ అంబేద్కర్ జన్మస్థలం మహా పుణ్య స్థలాల సందర్శన ఉంటుందన్నారు. ఈ రైలుకు కామారెడ్డి, నిజామాబాద్, నాందేడు, పూర్ణ స్టేషన్లో బోర్డింగ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి లేహ్, లడఖ్, చారుదాం, గోవాలకు విమాన ప్యాకేజీలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సమావేశంలో ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.